
## మాజీ మంత్రి సత్యవతికి తిరుపతిరెడ్డి పరామర్శ



సత్యవతిని పరామర్శిస్తున్న మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి

తొర్రూరు, మే 26 : మోకాళ్ల నొప్పులతో హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో సర్జరీ చేసుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను తొర్రూరు మార్కెట్ చైర్మన్ హనుమాన్ల తిరుపతిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఆమె పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ప్రజావాణి వినతులను వెంటనే పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, మే 26 : ప్రజావాణిలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన నేరుగా అర్జీలను స్వీకరించారు. పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యం ఇష్టమొచ్చినట్లుగా భ్రూణహత్యలకు పాల్పడుతున్నాయని, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను నియంత్రించాలని జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. జిల్లా వైద్యాధికారి నిర్లక్ష్యంగా ఉండడం వల్లే అబార్షన్లు జరుగుతున్నాయని, డీఎంహెచ్‌వో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న కొంతమంది స్కానింగ్ సెంటర్లకు మద్దతుగా ఉండి భ్రూణహత్యలకు పాల్పడుతున్నట్లు పట్టణంలో చర్చనీయాంశమైందని వినతి పత్రంలో పేర్కొన్నారు. జిల్లాలో వివిధ శాఖల నుంచి మొత్తం 122 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఎమ్మార్వోలు పాల్గొన్నారు.



బయ్యారం: జవాన్ అజహర్‌ను సన్మానిస్తున్న ఉపాది కూలీలు

## 'ఆపరేషన్ సిందూర్' జవాన్‌కు సన్మానం

మహబూబాబాద్ రూరల్/బయ్యారం, మే 26 : ఆపరేషన్ సిందూర్ పాల్గొని విజయం సాధించి పట్టణానికి వచ్చిన షేక్ అజహర్‌ను సోమవారం దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహబూబ్ పాషా ఆధ్వర్యంలో, బయ్యారం మండలం కట్టుగూడెం శివారులో పని చేస్తున్న ఉపాధి కూలీలు ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో మహ్మమద్ రంజాన్, యాకూబ్, జానీ, నాసర్, జబ్బార్, మదార్, మీరా, జమాల్, రజాక్, ఫీల్డ్ అసిస్టెంట్ బావుసింగ్ పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దవంగర, మే 26 : మండలంలోని వడ్డేకొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మండల కేంద్రంలోని సాయిగార్డెన్స్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో 2009– 2010 బ్యాచ్ పూర్వ విద్యార్థులందరూ ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాటి గురువులు వీరన్న, సాధిక్, వెంకటేశ్వర్లు, అనిల్, శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు భీరన్న, సంపత్, సురేశ్, నరేశ్, శంకర్, యాకన్న, స్వాతి, కల్యాణి, శారద, నర్మద, శిరీష, సతీశ్ పాల్గొన్నారు.



వడ్డేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ వరేణ్య ఆయుర్వేద క్లినిక్‌లో మేనేజర్‌గా చేయుటకు డిగ్రీ పూర్తిచేసిన యువతి కావలెను. జీతం : 9000/– వెంటనే సంప్ర: 9160210555. NTW-000

★ ఎలాంటి విద్యార్హత లేకున్నా పర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883. NT-325336

**CHANGE OF NAME**

★ I, LYADELLA KATTAIAH s/o LYADELLA IALAIAH Resident of 4-110, Gorrekunta Geesugonda, Warangal -506006. Solemnly declared that I have changed my name from LAYDELLA KATTAIAH to LYADELLA KATTAIAH for all future purposes. NTW-000

**CHANGE OF NAME**

I, GODISHALA SHYAM H.No. 12-8-213/21, Ramannapet, Santhoshimatha Colony, Warangal City & District-506002, T.G, India. I Have changed my Name From GODISHALA SWAMY to GODISHALA SHYAM for all purposes.

**CHANGE OF NAME**

★ I, the undersigned MUNDADA TARA (New name) previously called TARAKUMARI MUNDADA (Old name), W/o SRINIVAS MUNDADA R/o. H.no: 8 4-90, Sri Krishna Colony, Station Road, Warangal district,-506002, TELANGANA solemnly declare. NTW-17658

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565


# చెరువు కట్టలకు మరమ్మతులెప్పుడు..?

- నీళ్లు ఆగేదెట్లా.. పంటలు పండేదెట్ల..
- ఇప్పటికే రెండు పంటలు సాగుకు నోచుకోలె..
- 10 నెలలైనా పట్టింపేది?
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు



రాజులకొత్తపల్లి, రావిరాలలో తెగిన చెరువు కట్టలు

నెల్లికుదురు, మే 26 : గతేడాది ఆగస్టు నెలాఖరు నుంచి సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు నెల్లికుదురు మండలంలోని రాజులకొత్తపల్లి, రావిరాల గ్రామా లు అతలాకుతలమయ్యాయి. రాజులకొత్తపల్లి చెరువుకు పరిమతికి మించి వరద పోటెత్తడంతో చెరువు కట్ట పూర్తిగా తెగిపోయింది. చెరువు నీళ్లన్నీ రావిరాల గ్రామం చెరువులోకి వెళ్లాయి. దీంతో రావిరాల గ్రామం మొత్తం జలదిగ్బంధంలో చిక్కుకున్నది. ఇండ్లలోకి నీరు రావడంతో ప్రజలు తమ ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని డాబాల పై గొడుగులు పట్టుకొని తలదాచుకున్నారు. రావిరాల గ్రామ చెరువులోకి కూడా సామర్థ్యానికి మించి నీళ్లు రావడంతో ఆ చెరువు కట్ట కూడా పూర్తిగా తెగిపోయింది. చెరువు కింద ఉన్న పంట పొలాలన్నీ నీళ్లలో కొట్టుకుపోయాయి. గ్రామంలో పదుల సంఖ్యలో ఇండ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. జీవాలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఆలేరు చెరువు కట్ట పరిస్థితి కూడా అంతే. ఆ చీకటి రోజును ప్రజలు ఇప్పటికీ తలుచుకుంటూ భయభ్రాంతులకు గురవుతున్నారు. కాగా, నాడు కురిసిన వానలకు రావిరాల, రాజులకొత్తపల్లి, ఆలేరు గ్రామాల చెరువులు, కొన్ని కుంటల కట్టలు తెగిపోయి నేటికి పది నెలలు దాటింది. కానీ, ఇప్పటి వరకు ఒక్క ఆలేరు చెరువు కట్ట తప్ప.. మిగిలిన చెరువుల కట్టలు మరమ్మతుకు నోచుకోలేదు. కాంగ్రె స్ ప్రభుత్వంలో అసలు పట్టించుకున్న పాలకుడు లేడు. ప్రభుత్వ అధికారులు లేరు. తెగిన కట్టలకు మరమ్మతు చేయించి, సాగుకు నీళ్లివ్వాలని రైతులు రోడ్లెక్కి ధర్నాలు, ఆందోళనలు చేసినా పట్టించుకునే వారు లేరు. ఎమ్మెల్యే లు, మంత్రులు, ఇరిగేషన్ ఉన్నత అధికారులకు వినతిపత్రాలిచ్చి వేడుకున్నా ఫలితం లేదని స్థానిక రైతులు ఆవేదన చెందుతున్నారు.

**బీడువారుతున్న 1200 ఎకరాలు**

మండలంలోని తెగిన చెరువు కట్టల పారకంలో నీళ్లు లేక సుమారు 1200 ఎకరాల్లో పంటపొలాలు బీడువారాయి. రాజులకొత్తపల్లి గ్రామంలోని చెరువు కట్ట కింద సుమారుగా 800 ఎకరాలు, రావిరాల గ్రామంలో 400 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. ఈ భూములకు చెరువు నీరే ఆధారం. ఆ చెరువుల కట్టలు తెగి 10 నెలలు గడుస్తున్నా మరమ్మతు పనులు చేపట్టడం లేదు.ఇప్పటికే రైతులు వానకాలం, యాసంగి పంటలు సాగు చేసుకోలేకపోయారు. అలాగే వదిలేస్తే ఈ వానకాలం పరిస్థితి కూడా ఇక అంతే సంగతని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలడంతో, ముందస్తుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇప్పటికిప్పుడు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించినా వానలు కురిసే నాటికి పనులు పూర్తవ్వడం కష్టమేనని రైతులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా మూడు పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెరువు కట్టల మరమ్మతు పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.



నర్సింహులపేట:ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

## ఆ సార్లు ఎప్పుడూ ఆలస్యమే..?

నర్సింహులపేట, మే 26 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో యాకయ్య మినహా అధికారులు, సిబ్బంది 11 గంటల వరకు కార్యాలయానికి రాకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అధికారుల కోసం వేచిచూడాల్సిన దుస్థితి నెలకొన్నది. దీనికి తోడు ఉపాధి కార్యాలయంలో ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు సైతం రాకపోవడంతో ఉపాధి డబ్బులు, వివిధ పనుల కోసం వచ్చిన కూలీలు ఎదురు చూస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో మాట్లాడుతూ.. సమయపాలన పాటించని అధికారుల, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. మూడు రోజులు సమయ పాలన పాటించకపోతే ఒక రోజు సెలవు వేస్తామన్నారు.

## పారాబాయిల్డ్ మిల్లుకు ధాన్యం నిలిపివేత

**డీసీవో ప్రేమ్ కుమార్**



పెద్దనాగారం మిల్లు వద్ద రైతులతో మాట్లాడుతున్న డీసీవో ప్రేమ్ కుమార్

నర్సింహులపేట : ధాన్యం బస్తాల తరలింపులో ఆలస్యం చేయడంతోపాటు తేమ పేరుతో 3 కిలోలు తరుగు తీస్తున్న పారాబాయిల్డ్ మిల్లుకు ధాన్యం తరలింపును నిలిపివేసినట్లు జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దనాగారం స్టేజీ వద్ద పారాబాయిల్డ్ మిల్లు యజమాని ఐదు రోజులుగా బస్తాలు దింపడం లో ఆలస్యం చేస్తున్నారని, తేమ శాతం ఉం ద ని బస్తాకు 3 కిలోలు తరుగుతీస్తున్నారని రైతు ల ఫిర్యాదు మేరకు మిల్లును పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతు లు మిల్లు యజమాని ఇబ్బంది పెడుతున్నార ని, మాయిశ్చర్ లేదని బస్తాకు 3 కిలోలు కట్ చేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా మిల్లు వద్ద ఉన్న 10 లారీలను ఇతర మిల్లుల్లో బస్తాలు దింపేలా చర్యలు తీసుకున్నామన్నారు. రైతులను ఇబ్బందిపెడుతున్న పారాబాయిల్డ్ మిల్లుకు ధాన్యం తరలింపును నిలిపివేసి చర్యలు తీసుకుంటామన్నారు. డీపీఎం నళినీనారాయణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నెల్లికుదురు, మే 26 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని హెచ్‌ఎంలు బొమ్మరాతి సాయి లు, మచ్చ సోమయ్య అన్నారు. మండలంలోని శ్రీరామగిరి, రామన్నగూడెంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామా ల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించా రు. ప్రైవేటు పాఠశాలలు వద్దు.. సర్కారు బడులే ముద్దు' అని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విలియమ్స్, భాగ్యమ్మ, బీ కవిత, నర్సింహారెడ్డి, మాధురి, కళాధర్ రాజు, రజిత, బుచ్చిరామయ్య, వెంకటే శ్వర్లు, యాదగిరి, రమేశ్, సునిల్‌కుమార్ పాలొన్నారు.

**గార్లలో**

గార్ల, మే 26: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందిస్తున్నట్లు గోపాలపురం హెచ్‌ఎం మెకాళ్ల రామచంద్రు అన్నారు. సోమవారం గోపాలపురం గ్రామంలో బడిబాట కర పత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు.




సీఎంఎఫ్ఆర్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గార్ల, మే 26 : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం పీఏసీఎస్ సొసైటీ కార్యాలయం వద్ద రైతులకు జీలుగు విత్తనాలు, 40 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, 47మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఎరువులు, విత్తనాలను వినియోగించుకోవాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్, తహసీల్దార్ శారద, ఎంపీడీవో మంగమ్మ, ఏవో రామారావు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఘర్షణ

**యువకుడి మృతి.., ఐదుగురు జైలుకు తరలింపు..**

తొర్రూరు, మే 26 : మద్యం మత్తులో యువకుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి మృతికి కారణమైంది. ఈ ఘటన సోమవారం తొర్రూరు మండలంలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 23వ తేదీన అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మద్యం తాగి ఉన్న రెండు యువకుల గ్రూపులు ఘర్షణకు దిగాయి. ఈ క్రమంలో మాటేడు గ్రామానికి చెందిన ఎర్రం శివకుమార్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై పరస్పర ఫిర్యాదులు నమోదు కావడంతో పోలీసులు మొత్తం 9 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రాథమిక దర్యాప్తులో భాగంగా ఫతేపురం గ్రామానికి చెందిన తిరుపతి అజయ్ (22), తిరుపతి ప్రదీప్ (18), తిరుపతి సంతోష్ (21), పెద్ద ముప్పారం గ్రామానికి చెందిన దాసరి రాజు (19), తొర్రూరు పట్టణానికి చెందిన ఎండీ. సుఫియాన్ (23)ను పోలీసులు అరెస్ట్ చేసి, సోమవారం మహబూబాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై ఉపేందర్ వెల్లడించారు.

# పడకేసిన పారిశుధ్యం

- డోర్నకల్ మున్సిపాలిటీలో పేరుకుపోయిన చెత్తాచెదారం
- మురుగునీరు పారక డ్రైనేజీల నుంచి దుర్వాసన
- పట్టించుకోని అధికార యంత్రాంగం



డోర్నకల్ మున్సిపాలిటీలో 8 వ వార్డులో డ్రైనేజీ

డోర్నకల్, మే 26 : డోర్నకల్ మున్సిపాలిటీలో పారిశుధ్యం పడకేంది. గత ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌లు, ఫ్రైడే.. డ్రైడే వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ పట్టణాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవేమీ పట్టించుకోకపోవడంతో పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో రోగాలు కలుగజేసే దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. దీనికి తోడు కొందరు డ్రైనేజీలను అక్రమించి, వాటిపై షాపులు ఏర్పాటు చేయడంతో మురుగు నీరు కిందికి పారడం లేదు. దుర్వాసన వెదజల్లుతున్నది. డ్రైనేజీలపై షాపులను తొలగించాలని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. షాపుల యజమానులు అధికార పార్టీ నాయకులు కావడంతో మున్సిపల్ అధికారులను బెదిరిస్తూ, ఎమ్మెల్యే పేరును అడ్డం పెట్టుకొని యథేచ్ఛగా షాపులు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కొన్ని వార్డులను మాత్రమే ఎంచుకొని పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారని, మిగతా వార్డుల వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. మరికొద్ది రోజుల్లో వర్షాలు పడితే సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిద్రమత్తును వీడి పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



చెత్త చెదారంతో నిండిన డస్ట్ బిన్

## మానుకోటను అందంగా తీర్చిదిద్దుతాం..

మహబూబాబాద్ రూరల్, మే 26 : మానుకోట పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. సోమవారం పట్టణంలో పలు జంక్షన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, మాట్లాడారు. పట్టణాభివృద్ధికి మున్సిపాలిటీ నిధులు రూ.కోటి 10లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ముత్యాలమ్మ సెంటర్, వైఎస్సార్ కూడలిలో జంక్షన్లను అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే అండర్ డ్రైనేజీ పనులు సైతం ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, శంతన్ రామరాజు, వెంకన్న పాల్గొన్నారు.

## యువతరం రాజకీయాల్లోకి రావాలి

మరిపెడ, మే 26 : సంక్లిష్టమైన రాజకీయ పరిస్థితులను ఎదురంచడానికి యువతరం రాజకీయాల్లోకి రావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు బిరెడ్డి సాంబశివ అన్నారు. జిల్లా రాజకీయ తరగతుల్లో భాగంగా సోమవారం పురపాలక సంఘం పరిధిలోని స్థానిక కనకదుర్గ ఫంక్షన్‌హాల్‌లో రెండోరోజు 'భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, గత పోరాటాల అనుభవాలు' అనే అంశంపై తరగతులను బోధించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయి యువత ఉగ్రవాదం వైపు అడుగులు వేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్‌గా వీరయ్య వ్యవహరించగా, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు గుణగంటి రాజన్న, సూర్నపు సోమయ్య, కుంట ఉపేందర్, శ్రీనివాస్, జిల్లా కమిటీ నాయకురాలు కవిత, గార్ల మండల కార్యదర్శి సత్యవతి, మరిపెడ మండల కార్యదర్శి మధుసూదన్ పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలను అందించాలి

మహబూబాబాద్ రూరల్ : విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని ఏడీఏ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం పట్టణ శివారు ఏటిగడ్డతండా రైతు వేదికలో విత్తన డీలర్లుతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అంటగడితే శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏవో తిరుపతిరెడ్డి, ఎమ్మార్వో రాజేశ్వర్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా బహిరంగ వేలం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా హెడ్ క్వార్టర్‌లో నిర్వహించిన పనికిరాని వాహనాల బహిరంగ వేలం ప్రశాంతంగా, పారదర్శకంగా ముగిసినట్లు ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు ఆర్ఐ స్టోర్స్, ఎంటీ సెక్షన్ వద్ద పనికి రాని వస్తువులకు బహిరంగ వేలం నిర్వహించామని, వాహనాల విడి భాగాల ద్వారా రూ.46,200, ఆర్ఐ స్టోర్స్‌లో, ఇతర వస్తువుల నుంచి మొత్తం రూ.1,25,900 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు నరేందర్, సత్యనారాయణ, చంద్రమౌళి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతే సంగీతం, సాహిత్యానికి ఊపిరి

మహబూబాబాద్ రూరల్ : ప్రకృతే సంగీత, సాహిత్యానికి ఊపిరి పోసిందని సినీ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అన్నారు. సోమవారం పట్టణంలోని నూతనంగా ఏర్పడిన లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలోని మనుషులు నిత్యం ప్రేమాభిమానాలతో మెలగాలని, అప్పుడే ప్రతి ఒక్కరికి మానసిక ఆనందం కలుగుతుందన్నారు. లేని పోని అనుమానాలు పెట్టుకొని, ఒత్తిడికి గురై ఇబ్బందిపడొద్దన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడిగా బానోత్ వీరన్న, కార్యదర్శిగా పర్కాల రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా కరుణాకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రంజిత్‌రెడ్డి, సుధాకర్, రామ్మోహన్‌రెడ్డి, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

## సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీ

కురవి, మే 26 : మండల కేంద్రంలోని ఆంధ్రబ్యాంకు సొసైటీలో ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి, కాంపల్లి సొసైటీలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ రైతులకు సబ్సిడీతో జీలుగు విత్తనాలను సోమవారం అందజేశారు. రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా భూసారం పెరిగి దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవోలు నర్సింహారావు, చాయారాజ్, ఏఈవో రాజేశ్వరి, జితేందర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

**డోర్నకల్‌లో..**

డోర్నకల్, మే 26: డోర్నకల్ సొసైటీ, ఆగ్రోస్ సేవా కేంద్రాల్లో సోమవారం వ్యవసాయ విస్తరణాధికారి అవినాష్ రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుందని, రసాయన ఎరువులు వాడకం తగ్గుతుందన్నారు. పూత దశలో భూమిలో కలియదున్నితే ప్రయోజనం ఉంటుందన్నారు. రైతులు పంట మార్పిడి కూడా చేసుకోవాలన్నారు.

## ఉమ్మడి కురవి జీపీ సెక్రటరీల జేఏసీ ఎన్నిక

కురవి : సమస్యల పరిష్కారం కోసం కురవి, సీరోలు మండలాల్లోని పంచాయతీ సెక్రటరీలు ఉమ్మడి జేఏసీని సోమవారం ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా గుగులోత్ రాము, గౌరవ అధ్యక్షుడిగా సతీశ్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, కో కన్వీనర్లుగా శ్రీహరి, వెంకటేశ్వర్లు, సభ్యులు రాజు, కరిష్మా, రజిత, వెంకటేశ్, అశోక్‌ను ఎన్నుకున్నారు.

## పంట మార్పిడితో రైతులకు మేలు

చిన్నగూడూరు, మే 26 : పంట మార్పిడితో రైతులకు మేలు జరుగుతుందని ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు ఆగ్రోస్ సెంటర్‌లో సోమవారం జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏవో భాస్కర్, కేసముద్రం మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం

మరిపెడ, మే 26 : వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం మండలంలోని ఉలేపల్లి శివారు మాలోత్ తండాలో జరిగింది. ఆమె భర్త రమేశ్ కథనం ప్రకారం.. రమేశ్‌కు శ్రీనిధితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. పసువు కుంకుమ కింద 10గుంటల వ్యవసాయ భూమిని అగ్రిమెంట్ రాసి ఇచ్చారు. ఈ క్రమంలో శ్రీనిధికి ఆమె తల్లిదండ్రులు ఫోన్ చేసి నీ భూమి నీకు ఇస్తానని చెప్పగా, ఆదివారం మాలోత్‌తండాకు వెళ్లగా, అక్కడ తల్లిదండ్రులు, అన్న ఆమెను నానా బూతులు తిట్టి, కొట్టడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగింది. స్థానికులు మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, ఆత్మహత్యాయత్నం చేసుకున్న వివాహిత సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

మరిపెడ : ప్రస్తుత సీజన్‌లో రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో వీరాసింగ్ సూచించారు. సోమవారం పుర పాలక సంఘం పరిధిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో స్పందన సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డ్ ఆర్థిక సహకారంతో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మరిపెడ మండల అగ్రికల్చర్ ఆఫీసర్, నేషనల్ సీడ్ కార్పొరేషన్ అధికారి హాజరై మాట్లాడారు. నకిలీలను గుర్తించి అధికారులకు సమాచారం అంద జేయాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో స్పందన సోషల్ సర్వీస్ సొసైటీ అధికారి చొప్పరి సోమయ్య, సీఈవోలు పరశురాములు, నరేందర్, లింగయ్య, రవి వివిధ రైతు కంపెనీల డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ఆలయ ఉద్యోగి మృతి బాధాకరం

కురవి : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో మృతిచెందిన పోలోజు రవి కుమార్ సంతాపసభను ఆలయ ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... రవి చిన్నతనంలోనే మృతిచెందడం బాధాకరమన్నారు. ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, జనార్దన్‌రెడ్డి, సిబ్బంది సమ్మయ్య, నవీన్, తిలక్ పాల్గొన్నారు.